
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 | సంచిక : 2 | పుష్పం : 4-6 | 05-10-2001

RAMANA BHASKARA
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 12

**VOL : 7** **ISSUE : 2**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## మానసికతపస్సు

మనస్సు ఏకాగ్రంగా, నిశ్చలంగా, నిర్మలంగాఉండాలి. ప్రవీణతకూడా ముఖ్యము. అంతఃకరణములోకాని, చూపులోకాని, చేతలోకాని క్రూరత్వంపనికిరాదు. మనస్సును దయతో నింపుకోవాలి. వివేకము, సంపద, అందము, మంచితనము ఉన్నప్పటికి మనస్సు అణగిఉండాలి. అణగిన మనస్సుకే లోచూపు కల్గుతుంది. లోచూపుఉన్నవాడికి దూరదృష్టి ఉంటుంది. మనస్సు కల్పించే విషయములకు దూరముగా ఉండాలి. జీవితాన్ని నమ్రతతో నింపుకోవాలి.

ఏమార్గములో ప్రయాణముచేసినా మనోనిగ్రహము అత్యంత ముఖ్యము. మనోనిగ్రహము లేనివాడికి మనస్సుమీద అధికారమురాదు. మనోజయము సాధించినవాడికి మాత్రమే మాట, చేత స్వాధీనములో ఉంటాయి. మానసికతపస్సును ఆచరించువాడికి సత్త్వగుణము అలవడుతుంది, శ్రద్ధకల్గుతుంది. కర్మఫలము అనుకూలముగాఉన్నా, ప్రతికూలముగాఉన్నా సాత్త్విక బుద్ధిఉన్నవాడు సహనముతో భరిస్తాడు. చర్య ఉంటుంది కాని ప్రతిచర్య ఉండదు. మానసిక పరిపక్వస్థితిని సాధించుటకు పూజ, జపము, ధ్యానము, సాధుసాంగత్యము ఇవన్నీ సహకరిస్తాయి.

మనకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తపడాలి. మాట, చేత తలంపుమీద ఆధారపడి ఉంటాయి. తలంపులన్నీ మనస్సులో ఉంటాయి. అన్నితలంపులకు మూలమైన తలంపుని అహంవృత్తి అని అంటారు. అహంవృత్తి నశించకుండా ఆత్మజ్ఞానము లభ్యముకాదు. జ్ఞానము, శాంతి హృదయములోనే ఉన్నవి. వాటిని వెతికితే అవి దొరకుతాయి. పవిత్రమైన మానసము మాత్రమే హృదయములోఉన్న సత్యమును వెదుకుటకు తగిన అర్హత కల్గిఉంటుంది. హెచ్చుతగ్గులు లేకుండా పరిస్థితులతోటి, జనన మరణములతోటి సంబంధములేకుండా అన్నికాలములలోను, అన్నిఅవస్థలలోను పారమార్థిక సత్యం నిలకడగా ఉంటుంది. సత్యసాక్షాత్కారము పొందనివాడు శాంతి సామ్రాజ్యమునకు అధిపతికాలేడు. వ్యవహారిక సత్యములు కాలానుగుణముగా మారుతూఉంటాయి; వస్తూపోతూఉంటాయి. ఏకాగ్రమైన మనస్సు మాత్రమే సూక్ష్మ విషయములను గ్రహిస్తుంది. మనోచాపల్యమును తొలగించుకొనుటకు మనం చేస్తున్న ప్రయత్నమును మానసిక తపస్సు అనిఅంటారు. శారీరకతపస్సుకంటే, వాచికతపస్సుకంటే మానసికతపస్సు లోతైనది, గంభీరమైనది, ఉదాత్తమైనది, సమగ్రమైనది. మనస్సులో మంచిని పెంచుకోవాలి. మంచితనమే పరిణామంలో జ్ఞానమవుతుంది. అన్నివిధముల ప్రయత్నముచేసి మనస్సును స్వాధీనపరచుకొని జ్ఞానసముపార్జనకు కృషిచెయ్యాలి. జ్ఞానమే సుఖము, జ్ఞానమే ఆనందము, జ్ఞానమేశాంతి, జ్ఞానమేకాంతి.

- సద్గురు శ్రీనాన్నగారు

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

27-08-2001 మహదేవపట్నం ........ 3
17-09-2001 బలుసుపాడు ........ 8
23-09-2001 జిన్నూరు ........ 11

ఓం నమో భగవతే శ్రీరమణాయ

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 27-08-01, మహదేవపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన జీవితంలో బడిని, గుడిని మర్చిపోకూడదు. బడివలన చదువువస్తే గుడివలన సభ్యత, సంస్కారంవస్తాయి. విద్యఉన్నవారికందరికి సంస్కారంరాదు. అందువలన చదువు ఒక్కటేసరిపోదు. సభ్యత, సంస్కారం ఉండాలి. గుడికివెళ్ళి ఆవిగ్రహంలో భగవంతుడిని దర్శించటంవలన అంతఃకరణం శుద్ధిఅవుతుంది. నాస్థికుడికి అది విగ్రహమేకాని అక్కడ భక్తుడికి దేవుడు జ్ఞాపకంవస్తాడు కాబట్టి విగ్రహంవలన నిగ్రహం వస్తుంది. మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూఉంటాయి. ఇది ఇలాజరిగింది ఏమిటిఅని కంగారుపడకూడదు. ఆ సంఘటనలనుండి పాఠాలు నేర్చుకొని సమానబుద్ధిని అలవర్చుకోవాలి. మనకు శిక్షణఇవ్వటానికే జయాపజయాలు, లాభనష్టాలు, కష్టసుఖాలు సంఘటనల రూపంలోవస్తాయి. మనం బడిలోనేర్చుకొనే పాఠాలకంటే జీవితంలో నేర్చుకొనే పాఠాలు ఎక్కువ ఉంటాయి. అధ్యయనం, ప్రవచనం ఇవిరెండూ మహాతపస్సులుఅని ఉపనిషత్‌లలో చెప్పారు. చక్కగా శ్రద్ధగా చదువుకొని, అర్ధంచేసుకొని, నీవు ఆచరించగలిగింది ఆచరించి, దానిని ఇతరులకు అర్ధమయ్యేలాచెప్పాలి. నీవు నేర్చుకొన్నదానికి అనుగుణంగా జీవించటం, మనస్సును సంస్కరించుకోవటం, నీవు నేర్చుకొన్నదానిని ఇతరులకు అర్ధమయ్యేలా చెప్పటం ఇవిరెండూ మహాతపస్సులు. అధ్యయనంలో, నీవు నేర్చుకొన్నది ఇతరులకు చెప్పటంలో అశ్రద్ధ పనికిరాదు. గుడికివెళ్ళటం, జపంచేయటం, ధ్యానంచేయటం, సత్పురుషుల సహవాసంచేయటం, సద్గ్రంథాలు అధ్యయనంచేయటం వీటిఅన్నింటియొక్క ప్రయోజనం ఒక్కటే. మాయఅనే మహాస్వప్నంనుండి మేల్కొని మన హృదయంలోఉన్న నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అదే మన జీవితగమ్యం. మనహృదయంలోనిజం అనుభవంలోనికి వచ్చేవరకు మనం కర్మచక్రంలోనుండి విడుదలపొందలేము. మన దేహప్రారబ్దమునుబట్టి మనం ఎక్కడున్నా, ఏపనిచేస్తున్నా గమ్యం మరచిపోకుండా జీవించాలి. భౌతిక పరిస్థితులు అంతముఖ్యంకాదు. మీకుటుంబపరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు ఎలాఉన్నా అవిముఖ్యంకాదు, మీ మానసికవైఖరి ముఖ్యం. అంటే జీవితంలో ఎదురయ్యే సంఘటనలను మీరు ఎలా తీసుకొంటున్నారు అనేది





చాలాముఖ్యం. మదర్‌థెరిసా ప్రజలకు సేవచేసి, సేవచేసి తన జీవితాన్ని పండించుకొంది. ఆవిడకు నోబుల్ ప్రైజ్‌కూడాఇచ్చారు. మీజీవితంలో మరుపురాని సంఘటన ఏమైనాఉందాఅని ఆవిడను అడిగితే ఆమె ఇలాచెప్పారు. ఒకసారి రోడ్డుమీద నడిచివెళుతూఉంటే మున్సిపాలిటీ పెంటమీద ఒక వృద్ధురాలుపడిఉంది. ఆమెకు 90 సంవత్సరాలు ఉంటాయి, కాళ్ళుచేతులు కదపలేని స్థితిలోఉంది. అప్పుడు ఒక బండిని తీసుకొనివచ్చి, ఆ ముసలమ్మను బండిఎక్కించి, మా ఆశ్రమానికి తీసుకొనివచ్చి, స్నానంచేయించి, బట్టలుమార్చి, ఆహారంపెట్టి అమ్మా! ఎవరు నిన్ను ఆపెంటమీద పడేశారు అనిఅడిగాను. నా కొడుకేపడేసాడుఅని ముసలమ్మచెప్పింది. సరే అమ్మా! ఇప్పుడు నీకొడుకుమీద నీకు కోపంగాఉందా? అని అడిగాను. చాలాకోపంగాఉంది, నాకు చావువస్తోంది అని భయంలేదుకాని వాడిమీద కోపంతో నామనస్సు కాలిపోతోంది అనిచెప్పింది. అప్పుడు మదర్‌థెరిసా ఆమెతో ఈ ఆశ్రమంలో కొంతకాలంఉన్నతరువాత అయినా చనిపోతావు, దేహంయొక్క చావుముఖ్యంకాదు. మరణించే సమయంలో నీమనస్సుఎలా ఉంది? ఎంత ప్రశాంతంగాఉంది అనేదిప్రధానం. అందుచేత నీవు ఎవరిమీదో కోపంపెట్టుకొని చనిపోవటంకంటే ప్రశాంతంగా, సుఖంగా చనిపోవటంమంచిది. ఇలానీవు ఉద్రేకంగా చనిపోవటం నాకుఇష్టంలేదు. ఇవి జీవితంలోవచ్చే సంఘటనలు. నీకొడుకునీకు అపకారం చేసినమాటనిజమే. కాని నీవు ఉద్రేకపడితే నీకొడుకు నీకుచేసిన అపకారంకంటే నీవుఎక్కువ నష్టపోతావు. ఉద్రేకం మంచిదికాదు, ఇలా ఉద్రేకంతో చనిపోతే నీ స్వరూపానికి నీవుదూరమవుతావు. అందుచేత వాడిని క్షమించి, ఉద్రేకంలేకుండా ప్రశాంతంగా మరణిస్తే ఉత్తమస్థితిని పొందుతావమ్మా. నీకు నేనుఎంతోకొంత సేవచేసాను కదా! నామీద ఏమాత్రం గౌరవంఉన్నా, కృతజ్ఞతఉన్నా నాకోసం నీకొడుకును క్షమించానుఅని చెప్పు అమ్మాఅని మదర్‌థెరిసా ఆమెను అడిగింది. అప్పుడు ఆమెఎంతో కష్టంమీద లోపలనుండి కోపాన్ని తగ్గించుకొని క్షమించానుఅని చెపుతుంది, తరువాత కొద్దిసేపటికి ఆమె ప్రాణంపోయింది అని మదర్‌థెరిసా చెప్పారు. రాగద్వేషాలవలన ఉద్రేకాలువస్తాయి. వీటివలన మనస్వరూపానికి దూరమవుతున్నామని మనకు తెలియటంలేదు. అందువలన ఈ ఉద్రేకాలకు గురికాకుండా మనస్సుకు మనం శిక్షణఇవ్వాలి. మనస్సును పవిత్రంచేసుకో, ఏకాగ్రంచేసుకో, సూక్ష్మంచేసుకో లేకపోతే హృదయంలోఉన్న సూక్ష్మాతిసూక్ష్మమైన వస్తువు నీచేతికిఎలా అందుతుంది. నీవు ఎంతోకొంత ప్రయత్నంచెయ్యి, ఈశ్వరానుగ్రహంవస్తుంది. ప్రయత్నంలో

అశ్రద్ధ పనికిరాదు. ఏదోప్రయత్నం చేస్తున్నాము, మా ప్రారబ్దంబాగాలేదు అనుకోవద్దు. ప్రారబ్దందేహానికే, చైతన్యానికి ప్రారబ్దంలేదు. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికివస్తే దేహంయొక్క ప్రారబ్దం నిన్నుఏమిచేస్తుంది? లోపలఉన్న ఆనందం నీకుఅనుభవంలోనికివచ్చినప్పడు ఈ ప్రారబ్దం గొడవే నీకుఉండదు. పరిస్థితులు నీకు అనుకూలంగాఉన్నాయా, ప్రతికూలంగాఉన్నాయా అనేదిముఖ్యంకాదు. పరిస్థితులు ఎలా ఉన్నా నీ మనస్సు సమానంగాఉందా, లేదా అదిచూసుకో. ఏ పరిస్థితులు అయినా అవి స్థిరంగా ఉండవు. నీదేహమే శాశ్వతంకానప్పడు బైటనుండివచ్చే సంఘటనలు ఎలా శాశ్వతం అవుతాయి. ఆధ్యాత్మికపురోగతికి భౌతికపరిస్థితులకంటే మానసిక వైఖరి ప్రధానం. మంచితనం మనజీవితంలో ఒకభాగం అయిపోవాలి. మానసిక జీవితంఉన్నవాడికి మంచితనం విలువతెలుస్తుంది. భగవంతుడిని నిరంతరం స్మరించటంవలన మనస్సు హృదయంలో ఎక్కువకాలం ఉంటుంది. నీటిలోఉన్న వస్తువుఎలా నానిపోయి కరిగిపోతుందో అలాగ ఈశ్వరుని స్మరించగా, స్మరించగా నీమనస్సు నిశ్శేషంగా కరిగిపోయి హృదయంలోఉన్న ఆనందం నీకు అనుభవంలోనికివస్తుంది. ఏదిజరిగినా, ఏదిజరగకపోయినా ఇది మనమంచికోసమే అని గ్రహించినవాడికి మిగిలేది సమానబుద్ధే. ఈ విషయం గ్రహింపులేనివాడికి బుద్ధిలో హెచ్చుతగ్గులువస్తాయి. భౌతిక పరిస్థితులు ఎలాఉన్నా వాటినిపట్టించుకోవద్దు, అవి స్వప్నసమానము.

ఆహారంవిషయంలో జాగ్రత్తగాఉండమని భగవాన్ చెప్పారు. ఆహారం విషయంలో జాగ్రత్తగా లేకపోతే సాధనచేసినా సాధనాఫలం నీచేతికి అందదు. సాత్వికఆహారంకూడా అతిగా తినకూడదు, మితంగాతినాలి. తిండితినేటప్పడు, ఇతరులతోమాట్లాడేటప్పడు, లోకంలో వ్యవహరించేటప్పడు మనగమ్యాన్ని మర్చిపోకూడదు. ఆధ్యాత్మికత పేరుమీద సాంఘికవిలువలకు దూరంఅవ్వనక్కరలేదు. సంఘంలో నీపాత్రను నిర్మలంగా, నిదానంగా పోషిస్తూ ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుఅయ్యేలాగ జీవించాలి. సత్వగుణం సంపాదించుకొంటే మనస్సుకు పొందిక, స్వచ్ఛత వస్తాయి. అవసరాలు పెంచుకోవద్దు. అవసరాలు పెంచుకొంటే కష్టాలు పెరుగుతాయి. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే మనంరోజు నిద్రపోతున్నాము, తిరిగి మేల్కొంటున్నాము. ఇదంతా స్వప్నంతో సమానము. జననమరణ ప్రవాహంలోనుండి, అహంవృత్తిలోనుండి బయటకువచ్చి లోపలఉన్న ఆనందసముద్రంలో మునగటం అది మామూలు మెలుకువకాదు, అదిమహత్తరమైనమెలుకువ, దానిని మాటలలో వర్ణించలేము, అందులో మేల్కోవాలిఅని చెపుతున్నారు.

ఉద్యోగానికి రాజీనామాచేసి భగవాన్‌కు సన్నిహితంగా జీవించాలనిఉందిఅని ఒకరు అడుగుతున్నారు. భగవాన్‌తో సన్నిహితంగాఉండాలిఅంటున్నావు. భగవాన్ నీకంటే వేరుగాలేడు. భగవాన్‌అంటే నీలోపలఉన్న ఆత్మే. ఆయననీలోనేఉన్నాడు. ఆయనకు తెలియకుండాఏమీజరగదు. పనివిడిచిపెట్టి పారిపోవటం సన్యాసంకాదు, కోరికలను విడిచిపెట్టటం సన్యాసం, అహంకార, మమకారములను విడిచిపెట్టటం సన్యాసం, నీలోపలఉన్న వికారములను విడిచిపెట్టటం సన్యాసం. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినంత మాత్రంచేత అహంకార, మమకారములుపోవు, ఇంకాగట్టిగా బంధింపబడతావు. మనందరి బరువుబాధ్యతలను మోసేవాడు ఈశ్వరుడేఅని నీకు అర్ధమయితే ఆసక్తిఉండదు. ఆసక్తిఉన్నవాడికి దుఃఖంకాని, ఆసక్తిలేనివాడికి దుఃఖంలేదు. సన్యాసంఅంటే బాధ్యతలను విడిచిపారిపోవటంకాదు, నీ ఉద్యోగం ఏదోనీవుచేసుకోకాని నీప్రేమ విశ్వవ్యాప్తంఅవ్వాలి. నీలో వ్యక్తిభావన ఎంతకాలం అయితేఉందో అంతకాలం నీవు ఎన్ని ట్రైనింగ్‌లు అయినప్పటికి నీకు మోక్షంలేదు. భగవంతుడిని మనం మోసంచేయలేము. మిధ్యానేనులోనుండి విడుదలపొందితే సృష్టిఅంతా నీవేఉన్నావని నీకు అనుభవంలోనికివస్తుంది, అప్పడు నీప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. ఆప్రేమ ఒకకులానికో, ఒకమతానికో, ఒకప్రాంతానికో పరిమితంకాదు. పరిమితమైనది ఏదీ నిజంకాదు. ఉద్యోగంమానివేసినంతమాత్రంచేత హద్దులలోనుండి, పరిమితులలోనుండి, దేహబుద్ధిలోనుండి బయటకురాలేవు. అందుచేత అహంకారం, మమకారం తగ్గించుకొని మానసికంగా పరిపక్వ స్థితికివస్తే నీఉపాధిద్వారా శాంతి, కాంతి ప్రవహిస్తుంది. అందుచేత నీవు ఉద్యోగం విడిచిపెట్టటంకాదు, భగవంతుడిమీద విశ్వాసంపెట్టుకో. ఒక మనిషి ఎంత దురాచారుడైనా, భగవంతుడుఅనేవాడు ఒకడుఉన్నాడు అని సజీవమైన విశ్వాసంవాడికిఉంటే, మేము భక్తులముఅని చెప్పకొనేవారికంటే, వాడు ముందుబాగుపడతాడుఅని పరమాత్మ చెపుతున్నాడు. ఈ లోకంలో ఎన్నిభోగాలుఅనుభవించినా అవిస్వప్నంలో మామిడిపండు తినటంవంటిదే. రాత్రిస్వప్నంలో మామిడిపండుతిన్నాను చాలాబాగుందిఅని జాగ్రదవస్థలో అనుకొంటారా? అనుకోరు. ఎందుచేతనంటే అది నిజంకాదుఅనిమీకుతెలుసు. అలాగే మహత్తరమైన మెలుకువలోనికి వచ్చినవాడికి లోకంలో అనుభవించే భోగాలు అటువంటివే

అన్నారుభగవాన్. మానసిక అవరోధాలు పెంచుకోవద్దు. సహజంగా ఉద్యోగం, సంసారం నిన్ను విడిచిపెట్టాలికాని బలవంతంగా నువ్వు వాటిని విడిచిపెడితే పదేపదే అవేగుర్తుకువచ్చి నిన్ను బంధిస్తాయి. దేహమునేనుఅనే తలంపును త్యాగంచేయటమే నిజమైన సన్యాసం, అదేయజ్ఞం, అదేయోగం, అదేతపస్సు. అంతేకాని బట్టలుమార్చుకొని, ఉద్యోగంమానివేసి, ఇల్లువిడిచిపెట్టి వెళ్ళిపోయినంతమాత్రంచేత తలంపులు నిన్ను విడిచిపెట్టవు. ఇక్కడ పరిస్థితులు బాగాలేవని ఎక్కడికోవెళ్ళిపోతే అక్కడ పరిస్థితులు ఇంతకంటే దారుణంగా ఉండవచ్చు. సమయానికి అన్ని సదుపాయాలు ఉన్నప్పడే అభ్యాసంచేయలేకపోతే అవకాశాలు లేనప్పడు అభ్యాసం ఏమిచేయగలవు. లోపల శ్రద్ధ ఉదయించినప్పడు బాహ్యంగా ఏమీ అవరోధాలుకావు. ఇప్పడు మనస్సులో ఎన్ని వికారాలుఉన్నాయో ఈజన్మలో కృషిచేసి వాటిలోనుండి విడుదలపొందకపోతే ఈ వికారాలు అన్నీ భవిష్యత్ జన్మలలోనికికూడావస్తాయి. నీ మనస్సే నీకుశిక్ష. నీవు ఇంట్లోఉన్నా, అరణ్యాలలోఉన్నా, ఆశ్రమంలోఉన్నా, ఉద్యోగంచేస్తున్నా, మానివేసినా నీ మనస్సు నీకూడానేఉంటుంది. నీవు ఎక్కడఉన్నా మనస్సును జయించాలి అదిజ్ఞాపకంపెట్టుకో. మనస్సుఅనేది నీసొంతసమస్య. దానిని నీవే పరిష్కరించుకోవాలి. సమస్యలుఅన్నీ మనస్సులోనేఉన్నాయి దానిని అధిగమిస్తే ఇంక నీకు సమస్యలుఉండవు. మనస్సు అధిగమించినవాడిని ఈశ్వరుడు స్వాధీనంచేసుకొని తనచేతిలో పనిముట్టులా ఉపయోగించుకొంటాడు ఎందుచేతనంటే వాడికి స్వంతసంకల్పంఅంటూ ఏమీఉండదు, ఈశ్వరుని సంకల్పమే తన సంకల్పంగా వాడుజీవిస్తాడు.

ఓం నమో భగవతే శ్రీరమణాయ

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 17-9-2001, బలుసుపాడు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్యం మన హృదయంలోనేఉంది. ఉన్నదంతా మన హృదయంలోనేఉంది. సత్యం మన హృదయంలో ఉండటమేకాదు అది మన స్వరూపంగాఉంది. కాని మనం అసత్యంతో తాదాప్యం పొందుతున్నాము. మనం ఏదైతే అవునో దానితో మనకు తాదాప్యంలేదు. మనంకానిదానితో మనకు తాదాప్యంఉంది. అసత్యంతోటి, అనాత్మతోటి మనకుఉన్న తాదాప్యాన్ని





విడిచిపెట్టటానికి మనంచేసేప్రయత్నమే సాధన. మనం జపంచేసినా, ధ్యానంచేసినా, పూజచేసినా, విచారణచేసినా వీటిఅన్నింటియొక్క ప్రయోజనం ఏమిటిఅంటే అసత్యముతో మనకుఉన్న తాదాప్యంనుండి విడుదలపొందాలి. మనస్సు బయటకువెళితే బంధం, లోపలకువెళితే మోక్షం. మనస్సు ఎటువెళుతోందో చూసుకోండి. భగవంతుడు మనహృదయంలోనేఉన్నాడు కాని మనకు అనుభవంలోలేడు. మనకు అనుభవంలోఉన్న వస్తువువలన మనకు లాభం కలుగుతుందిగాని ఆయన మనహృదయంలోనేఉన్నా మనకు అనుభవంలో లేకపోతే మనకు సుఖంతెలియదు, శాంతితెలియదు. నీహృదయంలోఉన్న పరమేశ్వరుడు, నీహృదయంలోఉన్న ఆనందం నీకు అనుభవంలోనికివచ్చినప్పడు బాహ్యసుఖాలమీద నీకు ఆకర్షణఉండదు, నీమనస్సుకు చాపల్యంఉండదు. మనస్సు శరీరంలేకుండా ఉండలేదు. మనోనాశనం అవ్వకుండా నీ శరీరానికి మరణంవస్తే తిరిగి శరీరం వస్తుంది. అదేపునర్జన్మ.

నీవు కానిదానితో తాదాప్యం పొందకు. నీవు శరీరంకాదు, నీవు మనస్సుకాదు అని శాస్త్రం చెపుతోంది. ఏదైతే నీవుకాదుఅని శాస్త్రం చెపుతోందో దానితో నీవు తాదాప్యం పొందుతున్నావు. ఆ తాదాప్యంనుండి విడుదల పొందటానికే ఈ శ్రవణాలు, పూజలు, జపాలు, యజ్ఞాలు. నీవుఎవరో నీకుతెలిసేవరకూ నీవుకానిది నీవుఅని అనుకొంటూనే ఉంటావు. అందువలన ఇక్కడ గురువు సహాయం అవసరం. దేహాభిమానం ఉన్నంతకాలం శరీరంకూడా నీడవచ్చినట్లు దుఃఖం నీకూడావస్తుంది. దుఃఖకారణం బయటలేదు, నీలోపలేఉంది. భౌతికపరంగా, బాహ్యసంఘటనలవలనవచ్చే దుఃఖం 10 శాతం మాత్రమే. మిగిలిన దుఃఖానికి నీఅహంకారమేకారణం, నీమనస్సేకారణం. అందువలన మనస్సు పోయేవరకు దుఃఖం నశించదు. మనకు తెలియకుండా దేహానికి మనం ఎక్కువ చాకిరీ చేస్తున్నాము. దేహంపోతే మనం దుఃఖపడతాముకాని జ్ఞానికి దేహంపోతే ఈ చాకిరీవదిలింది అనుకొంటాడు. దేహంపోతే మనంపోతాము అనుకొంటాము అందువలన మనకు మరణంఅంటేభయం. దేహం పోయినప్పడుకూడా మనం ఉంటాముఅని జ్ఞానికి తెలుసు అందువలన జ్ఞానికి మరణభయంఉండదు దైనందినజీవితంలో నీ వ్యవహారంలో దేహబుద్ధిని తగ్గించుకోవాలి. అదే సాధన. దేహబుద్ధి నశించిన మరుక్షణంలో నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. మనకు ఏదైనా చెడుతలంపులు వస్తున్నాయి అనుకోండి. చెడుతలంపులు వస్తున్నాయి అని కంగారు

పడవద్దు. చెడుతలంపుల స్థానంలో మంచితలంపులు తెచ్చుకోవాలి. మనకు సారాత్రాగే అలవాటు ఉందిఅనుకోండి ఇంటిదగ్గరకూర్చొని బాధపడవద్దు. సారాత్రాగటం అలవాటులేనివారితో సహవాసం చేయాలి. మనకు ఏ బలహీనతఉందో ఆ బలహీనతలేనివారితో స్నేహంచేస్తే అది నెమ్మదిగా పల్చబడుతుంది. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూకూర్చోవద్దు. అది సాధనకు అవరోధం. వర్తమానకాలంలో జీవించండి.

ఇప్పడు మనం అందరం పుట్టాము అనుకొంటున్నామా? పుట్టలేదు అనుకొంటున్నామా? పుట్టాము అనుకొంటున్నాము. నేను పుట్టాను అనుకోనేవాడికి ఎవడికి మోక్షంరాదు అన్నారు భగవాన్. ఆత్మకుపుట్టుకలేదు. అయితే ఎవరుపుట్టారు? దేహంపుట్టింది. ఆ దేహమే నీవుఅనుకొంటున్నావు కాబట్టి నేను పుట్టాను అంటున్నావు. ఆ దేహమే నేనుఅనుకొన్నంతకాలం, దేహంతోతాదాప్యం పొందుతున్నంతకాలం నీకు మోక్షంలేదు. పుట్టనివస్తువు ఒకటి నీహృదయంలోఉంది. దానితో నీకు తాదాప్యం వచ్చినప్పడు, అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు నేను అసలు పుట్టలేదుఅని నీకుతెలుస్తుంది. ఆ జన్మలోనీకు మోక్షంవస్తుందిగాని అంతవరకు నీకు తరించే అవకాశంలేదు. పనిచేయనప్పడు నీవు ఎంతశాంతిగా ఉంటావో, పనిచేసేటప్పడుకూడా నీవు అంతశాంతిగా ఉండాలి. అది నిజమైనస్థితి. నేను టీచర్‌నుఅనుకోండి. ఇంటిదగ్గరఉన్నప్పడు ఎలాగఉన్నానో, క్లాసులో పాఠంచెప్పేటప్పడుకూడా అలాగేఉండాలి. అక్కడ విశ్రాంతిగాఉన్నాను, ఇక్కడనాకువిశ్రాంతిలేదుఅని అనుకొంటే అది సరియైనస్థితికాదు. అంటే లోపలఏదో వెలితిఉంది అనిఅర్థం. ఎప్పడూ సమానంగాఉండేస్థితి నీకులేకపోతే ప్రయత్నంచేసి దానిని సంపాదించుకోవాలి. నీలోపలఉన్న సత్యవస్తువుతో కలిసిఉంటే ఇంక బాహ్యంగాఉన్న సత్పురుషులతో నీకుపనిలేదు. ధ్యానం చేయటంవలన, జపంచేయటంవలన ఏప్రయోజనం పొందుతావో సత్పురుషుల సహవాసంవలన అదేప్రయోజనం పొందుతావు. సత్పురుషుల సహవాసంవలన మన మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సుకు లోచూపువస్తుంది, ఆత్మజ్ఞానం అందుతుంది.

మనం రోగంతగ్గటానికి అనేక రకాల వైద్యాలు చేయించుకొంటాము. ఏదైనా ఆరోగం తగ్గించుకోవటానికే. అలాగే మనం ఏమార్గంలో ప్రయాణంచేసినా, మన గురువు ఎవరైనా, మనమతంఏదిఅయినా దొంగనేనులోనుండి బయటకురావటంమీదే నీగురిఅంతాఉండాలి,





అదే నీగమ్యం. అసత్యంతో నీకుఉన్న తాదాప్యంవిడిచిపెట్టలేవుఅనుకో సత్యం నీహృదయంలోఉన్నప్పటికి అది నీకు అనుభవంలోనికి రాదు. అనుకొనేది మనసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈశ్వరసంకల్పాన్ని గౌరవించటం నేర్చుకొంటే ఇప్పడే ఇక్కడే దుఃఖం నశిస్తుంది. భగవంతుడు ఒకడుఉన్నాడుఅనే కృతనిశ్చయం మనకుఉండాలి, బుద్ధిలో చాపల్యంఉండకూడదు. శరణాగతిపొందినవాడు అద్వైతశాంతినిపొందుతాడు. కాలాన్ని, శక్తిని వృధాచేసుకోవద్దు. రాగద్వేషములు పెంచుకొంటే శక్తివృధాఅవుతుంది, చేసిన సాధన అంతాపోతుంది. సాధనచేసి అభివృద్ధిలోనికి రావాలంటే భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకోవాలి. సత్పురుషుల సహవాసంచేయాలి. రోజూకొంతసేపు ఏకాంతంగాఉండాలి. ఏకాంతవాసంలో మనమనస్సులో ఏమిఉందో, ఏబలహీనతలుఉన్నాయో మనకు తెలుస్తుంది. అప్పడు ప్రయత్నంచేసి ఆబలహీనతలనుండి విడుదలపొందాలి. నేనే కనుక అజ్ఞానినయితే ఇతరులకు బోధించటానికి నాదగ్గరఏమీలేదు, నేనే కనుక జ్ఞానినయితే నాకు బోధించటానికి ఇతరులులేరు అన్నారు భగవాన్.

ఓం నమో భగవతే శ్రీరమణాయ

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 23-9-2001, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆడంబరమైన ప్రసంగాలు వినకూడదు. ఆడంబరమైన రచనలు చదవకూడదు. వీటివలన ఆడంబరంపెరిగే అవకాశంఉంది, అహంవృత్తి పెరిగే అవకాశంఉంది. అది భౌతికవిషయం అయినా, ఆధ్యాత్మిక విషయంఅయినా భాషలో ఆడంబరం ఉండకూడదు, భావములో ఆడంబరం ఉండకూడదు. ఆడంబరంతోకూడిన భాషవలన, ఆడంబరంతోకూడిన భావముఉండటంవలన మనం జ్ఞానానికి, శాంతికి దూరమవుతాము. ఆధ్యాత్మికంవేరు, భౌతికంవేరు అని మనం అనుకొంటాము. దైవదృష్టితో ఏపనిచేసినా భౌతికంకూడా ఆధ్యాత్మికం అవుతుంది. మనం శిక్షణపొందటానికి ఈ ప్రపంచంలోనికి వచ్చాము. ఇప్పడు మనకు దేహాభిమానం ఉంది. మనం ఈ లోకాన్ని విడిచి.పెట్టకముందే దేహబుద్ధిని తొలగించుకొని అంటే శవబుద్ధిని తొలగించుకొని శివబుద్ధిని మనం అలవర్చుకోవాలి. భగవంతుడు మన

హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మన హదయంలో భగవంతుడుఉన్నాడని మనం మర్చిపోయాము. కనీసం గుడిలోఉన్న దేవుడిమీద ఉన్ననమ్మకం మన హృదయంలోఉన్న భగవంతుడిమీద మనకులేదు. ఆ దేవుడు సాపేక్షానికి సంబంధించినది. మనమనస్సు ఎంతనిజమో, పుణ్యపాపములు ఎంతనిజమో బయటున్న దేవుళ్ళుకూడా అంతేనిజం. హిందూమతంలో విగ్రరాధన ఏర్పాటుచేసారు. విగ్రహారాధనవలన అంతఃకరణశుద్ధి వస్తుంది. మనం ఏమార్గంలో ప్రయాణంచేసినా చిత్తశుద్ధి అనేగేటుద్వారానే హృదయంలోఉన్న భగవంతుడిని చేరుకోవాలి. మన మతంలో పొట్టగురించి, బట్టగురించి, సామాజికజీవితం గురించి, వాస్తుశాస్త్రంగురించి, వైద్యంగురించి ఇలా చాలా విషయాలగురించి చెప్పారు. ఇవిఅన్నీ చెపుతూ పొందవలసిన గమ్యంగురించికూడా చెప్పారు. నీశరీరానికి, నీమనస్సునకు, నీభావాలకు అతీతంగా ఒకసద్వస్తువు, బ్రహ్మం నీహృదయంలోఉంది. నీదేహానికి మృత్యువురాకముందే బ్రహ్మానుభవంపొందు, అదే నీగమ్యంఅనిచెప్పారు. నీకు బాల్యంలో బ్రహ్మజ్ఞానంలేకపోయినా, శరీరానికి ముసలితనం వచ్చినతరువాతఅయినా, లేకపోతే కనీసం ప్రాణంపోయేరోజుకి అయిన బ్రహ్మానుభవంపొందితే నీవుతరిస్తావు, ఇంక ఈభూమిమీదకు రావలసినపని నీకులేదుఅని భగవంతుడుచెప్పాడు. ఈ ప్రవచనాలయొక్క ప్రయోజనం ఏమిటిఅంటే వీటికి గొప్పలతోను, గౌరవాలతోను పనిలేదు, వీటివలన ఎవరికైనా శాంతికలగాలి, జ్ఞానంకలగాలి. ఎవరికైనా శాంతికలగుతుందనిచెప్పే ప్రవచనాలేగాని వీటివలన లౌకిక ప్రయోజనంఅంటూ ఏమీలేదు.

విరూపాక్షగుహలోఉండగా భగవాన్‌కు పుట్టినరోజుచేస్తారు. అప్పడు భగవాన్ ఏమిచెప్పారుఅంటే ఈ శవం పుట్టినరోజుకు ఇది అంతాఅనవసరం. ఈ శవంవచ్చింది ఏమిటి? ఇది మనలను పట్టుకుంది ఏమిటి? అని విచారణచేయాలిగాని ఈస్వీట్స్‌ఏమిటి అన్నారు భగవాన్. మనకు ఎప్పడైతే అజ్ఞానం నశించిందో, ఎప్పడైతే దేహబుద్ధి వేరుతోసహా నశించిందో అది నిజమైన పుట్టినరోజు. దేహంపుట్టినప్పడు నీవుపుట్టలేదు అదిఒకతలంపు. దేహం మరణించినప్పడు నీవుమరణించటంలేదు. అదిఒకతలంపు. జీవితంఅంతాతలంపులే. ఈ తలంపులుఅన్నీ దేహానికి రావటంలేదు. దేహమునేనుఅనే మొదటితలంపుకే అన్నితలంపులు వస్తున్నాయి. అందువలన విచారణచేసి దానిని తొలగించుకోవాలి. నీ మనస్సుకు చరిత్రఉంది, జాతికి చరిత్రఉంది, దేశానికి చరిత్రఉంది, దేహానికి చరిత్రఉందికాని నీలోపలఉన్న బ్రహ్మంకు





చరిత్రలేదు. నీవుకాని దేహంతోటి, నీవుకాని మనస్సుతోటి తాదాప్యం పొందుతున్నావు. వీటిఅన్నింటికి చరిత్రఉంది. కాని నీవుఏదిగాఉన్నావో దానికి మాత్రం చరిత్రలేదు.

భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే నీదేహంకంటే, ఇంద్రియములకంటే, మనస్సుకంటే, ధనంకంటే, మీలోఏమైనా మంచిగుణాలుఉన్నా వాటిఅన్నింటికంటే అతీతమైన వస్తువు, అమృతవస్తువు నీహృదయంలోఉంది. అది స్వయంగా ప్రకాశిస్తోంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అదే నీ జీవితగమ్యం. నీవు గమ్యాన్ని ఎప్పడూ మర్చిపోవద్దు. అమృతవస్తువు నీహృదయంలోఉన్నా నీకు ఎందుకు తెలియటంలేదుఅంటే నేనుఅదిగాఉన్నాను, నేనుఇదిగాఉన్నాను, నేను పురుషుడుగాఉన్నాను, నేనుస్త్రీగాఉన్నాను, నేనుగొప్పగాఉన్నాను, నేనుతక్కువగాఉన్నాను అని ఈ పెంటఅంతా మోసుకొని తిరుగుతున్నావు ఇలా అనుకోవటంవలన నీవు ఎవరో నీకు తెలియటంలేదు. నీశరీరానికి, నీమనస్సుకు అపచారం ఉండవచ్చు. నీవు ఆత్మవు, ఆత్మకు అపచారంలేదు. అక్కడికివెళ్ళు, నీఉపాధితో సంబంధంలేని వస్తువు ఒకటి నీహృదయంలోఉంది, దానిని పొందాలంటే నీవు అనవసరంగా లేనిపోనివి అనుకోవటంమానెయ్యి, ఊహించుకోవటంమానెయ్యి, అంతకంటే పెద్దకష్టపడనక్కరలేదు. ఇప్పడే ఇక్కడే నీస్వరూపంవ్యక్తమవుతుంది. గుడిలోఉన్న దేవుడిమీద మనకు విశ్వాసంఉంది, హృదయంలోఉన్న భగవంతుడుమీద మనకు విశ్వాసంలేదు. దొంగనేనుఏమి చెపుతుందిఅంటే దేవుడుహృదయంలోలేడు, గుడిలోఉన్నాడుఅనిచెపుతుంది ఎందుచేతనంటే అక్కడకు వెళితే దానికిమరణంరాదు, హృదయంలోఉన్నదేవునిదగ్గరకు వెళితే దానికి మరణంవస్తుంది. దానిమరణాన్ని అదికోరుకోదు అందువలన దేవుడు అక్కడఉన్నాడు, అలాచెయ్యి, ఇలాచెయ్యి అనిచెపుతుంది. ఇలా కొన్నివేల జన్మలు గడిచిపోతున్నాయి.

జీవితంలో మనకు అనుకూలసంఘటనలువస్తాయి, ప్రతికూలసంఘటనలువస్తాయి. అలాగే జ్ఞానికి ఆదేహప్రాబ్దమునుబట్టి అనుకూలసంఘటనలు, ప్రతికూలసంఘటనలువస్తాయి. కాని సంఘటనలప్రభావం జ్ఞానిమీదఉండదు. ఎందుచేతనంటే అక్కడ స్వతంత్రమైన ఆనందం, శాంతిఉంది. మనకు స్వతంత్రమైన శాంతిలేదు అందువలన అనుకూలమైనసంఘటనలువస్తే పొంగిపోతాము, ప్రతికూలమైన సంఘటనలువస్తే కృంగిపోతాము. ప్రపంచంలో ఏవస్తువుకు, ఏసంఘటనకు ప్రత్యేకమైన వ్యక్తిత్వంలేదు. ఒకే సంఘటన ఇద్దరికి జరిగిందిఅనుకోండి. ఒకడు నిర్మలంగాఉంటాడు, ఒకడుదుఃఖపడతాడు కారణంఏమిటిఅంటే వాడు తీసుకోవటాన్నిబట్టి

ఉంటుంది. ఆ సంఘటన స్వతంత్రమైనదికాదు, సంతోషం, దుఃఖం తీసుకొనివచ్చే శక్తి దానికిలేదు. వాడు తీసుకొనే పద్ధతినిబట్టి ఒకడికిసంతోషం, ఒకడికిదుఃఖంవస్తోంది. అందులోసంతోషంలేదు, దుఃఖంలేదు. ఇటువంటి సంఘటనలు జ్ఞానికికూడా కలుగుతాయి. జ్ఞానిపొందే సంతోషం, ఆనందం స్వతంత్రమైనవి కాబట్టి బాహ్యసంఘటనలు ఏమీవాడిని డిస్ట్రబ్‌చేయలేవు. సంతోషం ఒకతలంపు, దుఃఖంఒకతలంపు. ఇవి నిజంకాదు. ఇవికేవలం ఉద్రేకాలు. వీటివలన నారమల్‌లైఫ్‌కు దూరమవుతావు. ఎంతోకష్టపడిపోతున్నాను అనినీవు అనుకొంటున్నావు. ఎంతోకష్టపడితేనేగాని ఇదిరాదని నీకుఅనిపిస్తోంది. నీతలంపే నీకు రీలైజేషన్ రాకుండా అడ్డువస్తోంది. నీవు సింపుల్‌గాఉండు, నీవుప్యూర్‌గాఉండు నీవువస్తువును పొందుతావు అనిభగవాన్‌చెప్పారు. నేను మిమ్మల్ని ఎలాచూస్తున్నానో అలాగే ధ్యానబలంవలన నీవు దేవతాపురుషులను చూడవచ్చు, వారిదగ్గరనుండి వరాలు పొందవచ్చు. కాని ఆత్మానుభవంముందు, ఆత్మశాంతిముందు ఇవిఅన్నీక్రిందిమెట్లు, ఇవిఅన్నీ తీసికట్టు, ఇవిస్వప్నసమానము.

మనకు ఏదిమంచిదో, దేనివలన మనకు జ్ఞానంకలుగుతుందో మనకు తెలియదుకాని పరమేశ్వరుడికి తెలుసు. ఆయన దోషరహితుడు కాబట్టి మనలోఉన్న దోషాలనుండి మనలను ఎలా విడిపించాలో ఆయనకు బాగాతెలుసు. ఆయనకు అన్నీ తెలిసినప్పటికీ మనం ఏమనుకొంటున్నాముఅంటే ఆయన ఏమీతెలియనివాడని అనుకొంటున్నాము. మన అహంకారం చెప్పినట్లు దేవుడు వినాలని అనుకొంటున్నాము. మనస్సుఉంటే అంతాఉంది,

**ప్రతివాడూ అహంకారపు పిడికిలిపట్టులో చిక్కుకొని ఉన్నాడు. ఆ పట్టును వదలించుకోవాలంటే, సాధకుడు క్రొత్త వాసనలు సృష్టించుకోకుండా ఉండటం అవసరం.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**





అదిలేకపోతే ఏదీలేదు. ఈ మనస్సేనేనుఅని జన్మజన్మలనుండి మనకు అలవాటు అయిపోయింది. మనస్సు నశిస్తే ఉన్నదిఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది అదిపూర్ణం. నీవుఆత్మవు, నీవుచైతన్యానివి అనిభగవంతుడు చెవుతున్నప్పటికి మనస్సుతో నీకు ఎంత తాదాప్యంవచ్చిందిఅంటే కనీసం నీవుదానిని డౌట్‌చేయటంలేదు. అది నశించేవరకు నీకు ఆత్మానుభవంకలుగదు. మీరులక్ష్మీపుత్రులుఅనుకోండి, సరస్వతీపుత్రులు అనుకోండి, మీరు ఆరోగ్యవంతులుఅనుకోండి కానిమీరు అశాంతితో బాధపడుతున్నారుఅనుకోండి. మీకుఎన్నిఉన్నా మీరు అశాంతిని భరించలేరు. ఎందుచేతనంటే మీస్వరూపంలో శాంతిఉంది. మీస్వరూపానికి విరుద్ధమైనదిఏదీ మీరు భరించలేరు. మనకు చావుఅంటే ఇష్టంలేదు, అశాంతిఅంటే ఇష్టంలేదు, దుఃఖంఅంటే ఇష్టంలేదు కారణంఏమిటిఅంటే మీలోపలున్న సద్వస్తువుకు చావులేదు, దానికి అశాంతిలేదు, దానికి దుఃఖంలేదు. అది నీవైఉన్నావు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీజీవితగమ్యం.

పుణ్యం, పాపం, మంచి, చెడ్డ, పనిష్మెంట్‌లు ఇవిఅన్నీ మూలతలంపుకే. దానిని తీసిఒకప్రక్కనపెడితే ఏమీలేదు. కాని అదే నీవుఅనుకొంటున్నావు ఇంక దానినిఎలా

**అహంకారం లేకుండా ఆత్మ ఉండగలదు. ఆత్మ లేకుండా అహంకారం ఉండలేదు. వాటి సంబంధం నీటిబుడగకూ మహాసముద్రానికి గల సంబంధం వంటిది. అహంకారపు మూలం తెలుసుకుంటే ఆత్మ తెలియబడుతుంది.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

తొలగించుకొంటావు, తొలగించుకోలేవు. ఇక్కడే గురువుఅనుగ్రహం నీకుకావాలి. అదినీవుకాదుఅనేబుద్ధి నీకురావాలి, వివేకం నీకురావాలి. అది మనం ప్రయత్నంచేస్తేరాదు పరమేశ్వరుడు, గురువుఅంటువంటి బుద్ధిని మనకు ఇవ్వాలి. మూలతలంపును అన్వేషించు, దానిని విచారణచెయ్యి. దానిపుట్టుచోటు నీలోపలేఉంది. మూలతలంపు దానిమూలంలోనికి వెళితే మూలతలంపునశించటం, నిజం నీకువ్యక్తమవ్వటం ఒకేసారిజరిగిపోతాయి. మూలతలంపు మూలాన్ని నీవుచూడకుండా, ఆమూలతలంపుకు దేవతాపురుషులు కనిపించినా, ఏవైనాదృశ్యాలుకనిపించినా అవి నీధ్యానబలంవలన, తపోబలంవలన కనిపించినవేకాని అదిమటుకు ఆత్మసాక్షాత్కారంకాదు. ఒకవేళ నీకు సంతోషంవచ్చినా, దుఃఖంవచ్చినా అవినిజంకాదు, అవిజారిపోతాయి. అందువలన నీవు చేయవలసిన మొదటిపని, మధ్యపని, చివరిపని ఏమిటిఅంటే ఆమూలతలంపుతో నీకుఉన్నతాదాప్యం విడిచిపెట్టు, దానితో నీవుతాదాప్యంచెందకు.

భగవంతుడు ఎక్కడోఉన్నాడుఅని అనుకొంటున్నావు ఆయన నీ హృదయంలోఉన్నాడు. నీదేహప్రారబ్ధాన్నిబట్టి నిన్నునడిపిస్తున్నాడు. నీవుఎన్నిరకాలుగా ప్రయత్నంచేయగలవో అన్నిరకాలుగా ప్రయత్నించి నీలోపలఉన్న ఈశ్వరునికి శరణాగతిచెందు, నీపనిపూర్తిఅవుతుంది. నీవుచేయవలసింది అంతవరకే తరువాత ఏమిచేయాలో ఆయనే చూసుకొంటాడుఅని భగవంతుడు గీతలోచెప్పాడు. మహాత్ముడిద్వారా ఒకోసారి మహిమలుజరిగితే జరుగవచ్చు, అటోమేటిక్‌గా జరిగితే అదివేరేవిషయంకాని నేనుచేస్తున్నానుఅంటే వాడుమహాత్ముడుకాదు. నేనునిన్నుఉద్ధరిస్తాను, నీకురోగంతగ్గిస్తానుఅని ఇటువంటి మాటలుచెపితే అది ఆధ్యాత్మికంగా నిన్ను బ్లాక్‌మెయిల్ చేయటమే, నిన్ను సత్యానికి దూరంచేయటమే, ఇది ఒకరకమైన వంచన.

స్వార్థపరుడికి వేరుబుద్ధి ఎక్కువగాఉంటుంది. వేరుబుద్ధినశిస్తేనేగాని నీవు పునర్జన్మనుండి విడుదలపొందలేవు. వేరుబుద్ధి ఉన్నంతకాలం నీవు ఏజన్మకు ఆజన్మ శిక్షకు గురిఅవ్వవలసిందే. మీకు దేహమునేను అనేతలంపువస్తోందికదా. అదిదొంగనేను దానిచుట్టూ మనం తిరుగుతున్నంతకాలం జీవితంపట్ల, ప్రపంచంపట్ల నీకు రైట్ ఏటిట్యూడ్ అంటే సరియైన భావనరాదు. దొంగనేనులోనుండి తప్పడుభావనలేవస్తాయి. ఈదొంగనేను దానిమూలంలోనికి వెళితేగాని అదినశించదు. అప్పటివరకు నీకువేరుబుద్ధిపోదు. నీకు దుఃఖకారణం బయటలేదు, నీలోపలే అహంవృత్తిరూపంలోఉంది. అహంవృత్తి నశిస్తేగాని దుఃఖం నశించదు. నేను చాలాచదువులుచదివానుకాని దుఃఖంలోనుండి బయటపడలేదుఅని నారదుడు అడుగుతాడు. దుఃఖంలేని వస్తువును తెలుసుకొంటే దుఃఖంలోనుండి బయటపడతావుగాని మామూలు చదువులవలన దుఃఖంలోనుండి బయటపడలేవు. దుఃఖంలేనివస్తువుఒకటి నీహృదయంలోఉంది. అదేఆత్మ, అదేచైతన్యం, అదేబ్రహ్మం. అది అనుభవంలోనికివచ్చేవరకు దుఃఖం నిన్నువెంటాడుతుందిఅని నారదుడికి సనత్‌కుమారుడు చెప్పి ఆత్మవిద్యను భోదించాడు.

తెలివైనవారికి, తెలివితక్కువవారికి ఒక్కటేతేడా. తెలివైనవాడు కష్టాన్ని తనదాకారానివ్వడు. ఎదుటివాడికి ఏదైనా కష్టంవస్తే వాడికి ఏకారణంవలన కష్టంవచ్చిందో చూసుకొని ఆకారణంలోనికి వీడువెళ్ళడు. తెలివితక్కువవాడు ఏమిచేస్తాడుఅంటే కష్టంవాడిదాకావస్తేగాని వాడికి తెలియదు. అజ్ఞానం పెంచుకోవటానికి ప్రయత్నం చేయవద్దు. అజ్ఞానం తగ్గించుకోవటానికి ప్రయత్నంచేయండి. కొత్తవాసనలు కల్పించుకోవద్దు. దానివలన మూలతలంపు పెరుగుతూఉంటుంది. ప్రాణంపోయే సమయంలో ఎవడైతే వాడిపుణ్యాన్ని, పాపాన్ని ఇక్కడే వదిలేసి ఒంటరిగా ప్రయాణంచేస్తాడో వాడు బుద్ధిమంతుడుఅని భగవంతుడుచెప్పాడు. కర్తృత్వబుద్ధిఉన్నవాడు పుణ్యాన్ని, పాపాన్ని పట్టుకొనిపోతాడు. ప్రతీచిన్నవిషయానికి ఉద్రేకపడితే మూలతలంపు పెరిగిపోతుంది. పనిచేసి మనం మనస్సును పెంచుకోకూడదు. పనిచేసి మనస్సును అంతర్ముఖంచేసుకోవాలి. నీవుచేసే ధ్యానంవలన, జపంవలన, కర్మవలన మనస్సు అంతర్ముఖంఅవ్వాలి. వాటివలన మనస్సు అంతర్ముఖం అవ్వకపోతే నీకు పుణ్యంరావచ్చుగాని ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిరాదు. నిజంగా పనిచేసేవాడు, యాక్షన్‌లేకుండా పనిచేసేవాడు Discomfort లో ఉన్నప్పుడుకూడా Comfortలో ఉన్నాను అనుకొంటాడుఅంటే అసౌకర్యంగాఉన్నస్థితిలోఉన్నా సౌకర్యంగానేఉంది అంటాడు. మనకు పనిచేతకాదుకదా అందువలన మనకు ఎన్నిసౌకర్యాలుఉన్నా సౌకర్యాలులేవుఅంటాము. దేహబుద్ధిఉన్నవాడికి, శవబుద్ధిఉన్నవాడికి లోపల, బయట శివబుద్ధిఉన్నవాడికి లోపలలేదు, బయటలేదు. శివుడుఅంతటాఉన్నాడు. ఆయనకు ఆవరణ దోషమేలేదు. మనస్సులోనుండి బయటపడకపోతే నిజస్థితి నీలోఉన్నప్పటికి అందులోనీవుఉండలేవు. అందులోఉంటేగాని నిజం నీకు వ్యక్తంకాదు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | | |
|---|---|---|---|
| 07-10-2001 | ఆది | పెనుగొండ | రోటరి క్లబ్ ఉ॥ గం॥ 10-30 ని॥లకు |
| 14-10-2001 | ఆది | విశాఖపట్టణం | సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపం |
| 21-10-2001 | ఆది | పెదఅమిరం | ముదునూరి అబ్బాయిరాజు గారి ఇంటివద్ద |
| 24-10-2001 | బుధ | శృంగవృక్షం | అమ్మవారి గుడి |
| 26-10-2001 | శుక్ర | భీమవరం | యోగా స్కూల్ ప్రారంభోత్సవం, గునుపూడి నుండి నర్సాపూర్ రోడ్డు |
| 28-10-2001 | ఆది | కైకలూరు | టి.టి.డి. కళ్యాణ మండపము |
| 30-10-2001 | మం | నర్సాపురం | షిరిడి సాయిబాబా గుడి, పార్క్ రోడ్డు |
| 04-11-2001 | ఆది | జిన్నూరు | శ్రీ రమణ క్షేత్రం |

## పాఠకులకు మనవి

**రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-**

**అయిదు సంవత్సరముల చందా రు. 700/-**

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. పోస్టల్ చార్జీలు పెరిగిన కారణంగా ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :

**బి.హెచ్.వి. సుబ్బరాజు** ("రమణ భాస్కర" కొరకు)

శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265** ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

---

కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఒ./డి.డి./నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2001 నుండి 22-9-2002 వరకు)

పేరు..........................................................................................................

తండ్రి / భర్త..................................................................................................

డోర్ నెం.......................................వీధి/రోడ్ పేరు............................................

గ్రామం.........................................................................పిన్ కోడ్

మండలం..............................జిల్లా...................................రాష్ట్రం..........................

## శ్రీ రమణ క్షేత్రం ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | వినీలాకాశంలో వింతకాంతి | 25/- |
| 2. | అమృత వాక్కులు | 20/- |
| 3. | The Call of the Holy Hill | 20/- |
| 4. | మధుర వాక్యములు | 12/- |
| 5. | శ్రీ రమణ ప్రస్థానత్రయం | 12/- |
| 6. | శ్రీ రమణ మహిమలు | 5/- |
| 7. | దైవ సంపద | 12/- |
| 8. | జ్ఞాన కిరణాలు | 6/- |
| 9. | సద్గురు శ్రీ నాన్నగారు | 3/- |
| 10. | శ్రీ రమణ ప్రసాదం | 5/- |
| 11. | అక్షరమణమాల | 4/- |
| 12. | శ్రీ నాన్న ప్రవచనాలు | 20/- |
| 13. | వాశిష్ట రమణీయం | 5/- |
| 14. | సత్యాన్వేషణ-సత్యదర్శనం | 10/- |
| 15. | శ్రీ రమణ అనుగ్రహతరంగాలు | 80/- |

## శ్రీ రమణ క్షేత్రంలో లభించు శ్రీరమణాశ్రమ ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | శ్రీ రమణ భాషణములు | 80/- |
| 2. | శ్రీ రమణ లేఖలు | 80/- |
| 3. | శ్రీ రమణ దివ్య జీవితమకరందం | 50/- |
| 4. | నీ సహజ స్థితిలో ఉండు | 50/- |
| 5. | శ్రీ మహర్షి | 20/- |
| 6. | నేను ఎవడను? | 3/- |
| 7. | శ్రీ రమణ మహర్షి బోధలు | 20/- |
| 8. | శ్రీ రమణ కథాసుధ | 15/- |
| 9. | శ్రీ రమణ వైభవం | 45/- |
| 10. | శ్రీ రమణ గ్రంధమాల | 75/- |
| 11. | ఋభుగీత సారం | 15/- |
| 12. | శ్రీ రమణ స్మరణామృతం | 70/- |

నోట్ : పోస్టల్‌ద్వారా కావలసినవారు పోస్టల్ ఖర్చులుకూడా పంపించవలెను.

## రమణ భాస్కర ప్రచురణల బైండులు

| | | |
|---|---|---|
| 1. | 1998-1999 | రు. 75/- |
| 2. | 1999-2000 | రు. 100/- |
| 3. | 2000-2001 | రు. 125/- |

## చందాదారులకు గమనిక :

నూతన చందాదారులు, రెన్యువల్‌చేసే చందాదారులు చందా సొమ్మును ఎం.ఓ.ద్వారా పంపితే మీచందా వివరాలు నమోదు చేసుకొనబడును. ప్రతినెల మేము పంపించు మాసపత్రిక మీకు చేరకపోతే మీ అడ్రస్సు కూపన్ ప్రకారం పూర్తి డిటైల్స్‌తో వెంటనే మాకు తెలియజేయండి.

మీ చిరునామాలో మార్పుఉంటే దయచేసి వెంటనే మాకు తెలియజేయండి. ఆవిధముగా తెలియజేసినచో పత్రిక నేరుగా మి క్రొత్త చిరునామాకు వచ్చి చేరుతుంది. మాకు వ్రాసే ఉత్తరాలలో మీ చందా రశీదు నెంబరును తెలియపరచడం మరువకండి.